

సాక్షి గుంటూరు

గురువారం । 19 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 1046 క్యూసెక్కులు వదులుతున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.8660 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల కొరతకు చెక్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 450 పోస్టులు భర్తీ

గుంటూరుఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చి, విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాల బోధన జరిగేందుకు అర్హత కలిగిన ఎస్జీటీలను తాత్కాలిక ప్రాతిపదికన నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై నియమించేందుకు ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న నిర్ణయం ఆచరణలోకి వచ్చింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్, గణితం, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులు తగినంత మంది లేక విద్యా బోధనకు ఆటంకంగా మారింది. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఈనెల 13న గుంటూరులోని డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భాగంగా ఆయా సబ్జెక్టుల వారీగా 226 మంది ఉపాధ్యాయులను నియమించారు. 30 శాతం డీఎస్సీ కోటా కింద బుధవారం మరో 210 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విధంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించేందుకు మొత్తం 436 మంది ఉపాధ్యాయులను నియమించనుండగా, వారితోపాటు ఉర్దూ విభాగంలో మరో 14 మంది టీచర్లు నియమితులు కానున్నారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లా పరిధిలో 450 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేశారు.

నేడు పాఠశాలల్లో వేమన జయంతి వేడుకలు నిర్వహించాలి


గుంటూరుఎడ్యుకేషన్: యోగి వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించాలని డీఈఓ పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు వేమన పద్యాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు, హెచ్ఎంలు అన్ని పాఠశాలల్లో యోగి వేమన జయంతిని నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యార్డుకు 69,995 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 69,995 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 67,860 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.14,000 నుంచి రూ.23,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.16,500 నుంచి రూ.18,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 35,933 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 573.20 అడుగుల వద్ద ఉంది. ఇది 264.6026 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,292, ఎడమకాలువకు 6,634, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,936, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 27,582 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 13,649 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 846.60 అడుగుల వద్ద ఉంది. ఇది 73.0836 టీఎంసీలకు సమానం.

టెస్టింగ్‌లో మనమే బెస్ట్

- రాష్ట్రంలో గుంటూరు ల్యాబ్ ముందంజ
- దేశంలో మూడో స్థానం
- ఈసారి స్థానం మెరుగయ్యే అవకాశం
- పురుగుమందుల్లో నాణ్యత పెరుగుతోంది
- 1414 శాంపిల్స్ సేకరణ
- 11 శాంపిల్స్‌లోనే నాణ్యత లోపం



ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



గుంటూరు ల్యాబ్‌కు వచ్చిన అవార్డు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నాణ్యతా పరీక్షల్లో మనకు సాటి లేదు. పురుగుమందుల నాణ్యత, కల్తీలను తనిఖీ చేయడంలో మన ల్యాబ్‌ల పనితీరు దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిలుస్తోంది. ఈ ల్యాబ్‌ల పనితీరుపై ప్రతి మూడేళ్ల కోసారి జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఇందులో వారు పంపిన శాంపిల్స్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఎంత ఖచ్చితంగా ఉంటుందో దాని ఆధారంగా ర్యాంకింగ్స్ వస్తాయి. 2016–19 సంవత్సరాలకుగాను నిర్వహించిన పోటీలలో గుంటూరు ల్యాబ్ జాతీయ స్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. 2020–23 సంవత్సరాలకు సంబంధించిన పోటీలు పూర్తయ్యాయి. త్వరలో ఫలితాలు వస్తాయని, మరోసారి మెరుగైన ర్యాంక్ సాధిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2013–14 నుంచి గుంటూరు ల్యాబ్ ఈ పోటీలలో పాల్గొంటూ వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు ల్యాబ్‌లు ఉన్నాయి. గుంటూరు, తాడేపల్లిగూడెం, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురంలలో రాష్ట్ర స్థాయి ల్యాబ్‌లు ఉన్నాయి. 1968 పురుగుమందుల చట్టం ఆధారంగా 1974లో గుంటూరు ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

శాంపిల్స్ సేకరణ ఇలా...

క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు తయారీదారులు, పంపిణీదారులు, డీలర్ల వద్ద తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరిస్తారు. ఆ శ్యాంపిల్ వివరాలను ఇన్‌సైట్ యాప్‌లో నమోదు చేస్తారు. దానికి ఒక శాంపిల్ ఐడీ వచ్చి ఏ కోడింగ్ సెంటర్‌కు పంపాలో సూచిస్తుంది. రాష్ట్రంలో అమరావతి, తాడేపల్లిగూడెం, విశాఖపట్నం, తిరుపతిలలో కోడింగ్ సెంటర్లు ఉన్నాయి. శాంపిల్ ఐడీ చూపించిన విధంగా ఆ శాంపిల్‌ను కోడింగ్ సెంటర్‌కు పంపుతారు. అక్కడ ఆ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ యాప్‌లో వివరాలు నమోదు చేశాక ఏ ల్యాబ్‌కు పంపాలో ఇన్‌సైట్ యాప్ సూచిస్తుంది. దాని ఆధారంగా ఆ శాంపిల్ ల్యాబ్‌కు చేరుకుంటుంది. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుంది. ఏ శాంపిల్ ఎక్కడి నుంచి వచ్చిందన్నది ల్యాబ్ వారికి తెలియకపోవడం వల్ల ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉండదు.

ఆయా ల్యాబ్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలో శిక్షణ పొందిన అనలిస్టులు ఉంటారు. వీరు పరీక్షలు నిర్వహించి ఆ పురుగుమందుల నాణ్యతను నిర్ధారిస్తారు. దీని ఆధారంగా ఇచ్చిన నివేదిక కోడింగ్ సెంటర్‌కు వెళ్లి అక్కడి నుంచి శాంపిల్ తీసిన అధికారి వద్దకు వెళ్తుంది. ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరంలో 1560 శాంపిల్స్ వరకూ సగటున పరీక్షిస్తుంటారు. 2022–23 సంవత్సరానికిగాను ఇప్పటి వరకూ 1414 శాంపిల్స్‌ను పరీక్షించగా అందులో 11 మాత్రమే నాణ్యత లేనివిగా నిర్ధారణ అయ్యింది. ఈ ఏడాది రెండువేల శాంపిల్స్ వరకూ వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మెరుగైన పనితీరు మా లక్ష్యం



గుంటూరులోని పురుగుమందుల నాణ్యతను పరీక్షించే ల్యాబ్ మెరుగైన పనితీరుతో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. శాంపిల్స్‌ను పరీక్షించి పురుగుమందుల నాణ్యతను విశ్లేషించడం ద్వారా రైతుకు మంచి పురుగుమందులు అందించేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడులు చేసి శాంపిల్స్ సేకరిస్తుండటంతో రాష్ట్రంలో పురుగుమందుల నాణ్యత కూడా పెరిగింది.

– తోటకూర శ్రీనివాస్, పీటీఎల్ సహాయ సంచాలకులు

సాక్షి గుంటూరు

నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు ఓ కుటుంబం సిద్ధమైంది. డిసెంబరు 31 రాత్రి కేక్, స్వీట్లు తీసుకువచ్చేందుకు కుటుంబ పెద్ద బయటకు వెళ్లాడు. కేక్, స్వీట్లు తీసుకుని సంతోషంగా ఇంటికి బయలుదేరాడు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు కుటుంబ సభ్యులందరూ ఎదురు చూస్తున్నారు. కానీ మార్గంమధ్యలో గుర్తు తెలియని వాహనం రూపంలో మృత్యువు అతనిని కబళించింది. ఆ కుటుంబంలో కొత్త సంవత్సరం విషాదాన్ని నింపింది. కుటుంబం అనాథగా మారింది. ఇలాంటి సంఘటనలు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయి. అతివేగం.. నిర్లక్ష్యం..కారణం ఏదైనా..దాని ఖరీదు మాత్రం నిండు ప్రాణాలు పోతున్నాయి. నిబంధనలు పాటిస్తే అందరూ నిండు నూరేళ్ల సుఖ, సంతోషాలతో జీవించవచ్చు. అందుకే రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగానే బుధవారం జిల్లాలో వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

ప్రారంభమైన రోడ్డు భద్రతా వారోత్సవాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	గాయాలు
2021	1047	431	913
2022	1071	397	1011



ప్రమాదంలో మృతిచెందిన యువకులు (ఫైల్)

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): గుంటూరు జిల్లా పరిధిలో జరిగిన ప్రమాదాలు ముఖ్యంగా ద్విచక్రవాహనాల వలనే అధికంగా జరుగుతున్నాయనేది అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. బైక్ ప్రమాదాలు 38శాతం నమోదు అవ్వగా, అందులో 86శాతం పురుషులు మృతి చెందిన పరిస్థితులు ఉన్నాయి. వీటిలో అధిక శాతం మద్యం సేవించటం, హెల్మెట్ లేకపోవటం, అతివేగంతోనే జరిగినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా ప్రమాదం జరిగే 35 బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించిన అధికారులు నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నారు.

కేసులు నమోదు

ప్రమాదాలు అరికట్టేందుకు నిబంధనలు పాటించని వారిపై ఆర్టీఓ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో గతేడాది జిల్లా వ్యాప్తంగా 18,787 కేసులు నమోదు చేశారు. వాటిలో ముఖ్యంగా అతివేగంతో పయనిస్తున్న 12,410 వాహనాలకు స్పీడ్‌గన్, అధికారులు జరిమానాలు విధించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేవి 2969, హెల్మెట్ 366, రిఫ్లెక్ట్ స్టిక్కర్ లేని వాహనాలకు 1799, సరుకు రవాణా చేసే వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకున్న 79 వాహనాలు, మైనర్‌లు వాహనాలు నడిపితే 210, ఓవర్‌లోడ్ 631 కేసులు నమోదు చేశారు.

భద్రతా వారోత్సవాలు ఇలా...

ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారభమయ్యాయి. దానిలో భాగంగా బుధవారం డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. రెండో రోజు గుంటూరులోని ఎంటీబీ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో వాక్ థాన్, మూడో రోజు స్కూల్, కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నా రు. నాలుగో రోజు రక్తదాన, కంటి వైద్య పరీక్షల శిబిరం, ఐదో రోజు గుడ్ సమరియటన్‌లు, రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా వ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యపరిచే విధంగా చర్యలు, ఆరో రోజు ప్రొఫెసర్లు, ఇంజినీర్‌లు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం, ఆఖరి రోజు గుంటూరులో హెల్మెట్ ర్యాలీ, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు.

ప్రతి ఒక్కరి బాధ్యత



రోడ్డు భద్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించనప్పుడే ప్రమాదాలను అరికట్టగలం. నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించటం ద్వారానే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. 18 నుంచి 40 ఏళ్లలోపు వారే అధికంగా ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. ప్రజలు నిబంధనలు పాటించి.. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. మైనర్‌లకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాలి.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

అవగాహనతో రోడ్డు ప్రమాదాలు తగ్గించుకోవచ్చు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



ప్రచారరథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరువెస్ట్: ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలు, అతి వేగంపై కనీస అవగాహన పెంచుకుంటే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల అవగాహన ప్రచార రథాన్ని బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న వారోత్సవాల్లో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్, ప్రమాదాలు తదితర అంశాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో, ప్రభుత్వ, ప్రైవేటు వాహనాల డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, మేధావుల నుంచి వచ్చే సూచనలు, సలహాలు స్వీకరించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఎస్‌కే కరీం, గుంటూరు ఆర్టీఓ ప్రభాకరరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అధికారులు పాల్గొన్నారు.

కూలీలకు అస్వస్థత

- మొక్కజొన్నకు గుళికలు వేసిన కూలీలు
- 20 మంది ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పెదకాకాని: మొక్కజొన్న పైరుకు విష గుళికలు వేసేందుకు వెళ్లిన 20 మంది కూలీలు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పెదకాకాని మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన పల్లెంపాటి సాంబశివరావు, మంగళగిరి రూరల్ మండలం నిడమర్రులో పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ముఠా మేస్త్రి కొణతం సామ్రాజ్యం 20 మంది కూలీలతో ట్రాక్టర్‌లో వెళ్లారు. విషగుళికలు కావడంతో యజమాని కూలీలందరికీ ప్లాస్టిక్ గ్లౌజులు ఇచ్చాడు. కొద్దిసేపటికే చెమట పడుతుందని, పని సాగడం లేదని కొందరు ఆ గ్లౌజులు తీసివేసి మామూలుగా చేతులతోనే ప్రతి మొక్కకూ మొవ్వులో గుళికలు వేశారు. భోజనం చేసిన తరువాత వారిలో నలుగురికి వాంతులు మొదలయ్యాయి. మరి కొందరు కళ్లు తిరుగుతున్నాయి ఇంటి వెళదాం ఈ రోజుకు పని చేయలేమని తెల్పి చెప్పారు. దీంతో ట్రాక్టర్ యజమాని ముఠామేస్త్రితో కలపి 20 మందిని ట్రాక్టర్‌లో ఎక్కించుకుని ఉప్పలపాడు బయలు దేరాడు. మార్గమధ్యంలో కంతేరు వెళ్లే సరికి ట్రక్కులో ఉన్న వారిలో మరో ఐదుగురికి వాంతులు ప్రారంభమయ్యాయి. అదే గ్రామంలో ఉన్న వైద్యుడి వద్దకు వెళ్లగా వారిని పరిశీలించి గుంటూరు శ్రావణి ఆస్పత్రికి వెళ్లాలని సూచించాడు. అక్కడే ఉన్న అంబులెన్స్‌లో ఆస్పత్రికి చేరారు. వైద్యులు అందరికీ వైద్య పరీక్షలు చేసి సెలైన్ ఎక్కించి వైద్యం అందిస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కూలీల ఆస్పత్రి పాలైన ఘటన సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఆస్పత్రికి బాధితులను పరామర్శించారు. పరిమర్శించిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు దంతాల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ సభ్యుడు పల్లెంపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

అస్వస్థతకు గురైన కూలీలు

మొక్కజొన్న పైరుకు విష గుళికలు వేసి అస్వస్థతకు గురైన వారిలో కొణతం సాంబ్రాజ్యం, కల్యాణం శిల్పారాణి, కాసుల ధనలక్ష్మి, గోపిశెట్టి అంజమ్మ, లక్ష్మీశెట్టి కుమారి, అకరంశెట్టి కృష్ణవేణి, నందిపాటి హనుమాయమ్మ, బత్తుల సీతారావమ్మ, పల్లెంపాటి నాగలక్ష్మి, పసుపులేటి శ్రీలక్ష్మి, పసుపులేటి శారద, ఆవుల సత్యవతి, పిన్నమనేని పద్మ, దంతాల స్వాతి, పుసుపులేటి సాంబ్రాజ్యం, పల్లెంపాటి అనంతకుమారి, గంగిశెట్టి అచ్చమ్మ, గోపిశెట్టి వెంకాయమ్మ, పల్లెంపాటి త్రివేణి, గంగిశెట్టి విజయ ఉన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు



అభ్యర్థికి నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్

గుంటూరుమెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపికైన వారికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 272 కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, 8,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మెరిట్ ప్రాతిపదికన 272 మందిని సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు పిలువగా 50 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మిగతా అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇన్‌చార్జి ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, స్టాఫ్‌నర్సుల కౌన్సెలింగ్ నోడల్ ఆఫీసర్ పాటిబండ్ల జ్యోతిర్మయి, డీడీ అంజయ్య, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పట్టపు పాల్ పాల్గొన్నారు.

ప్రేమ ఒడిలో విజయాల జడి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ధైర్యం, పట్టుదల, దృఢ సంకల్పం ఉంటేనే మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించడం వీలవుతుంది. యుక్త వయస్సులో ఉన్న వారికి నేర్చుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరి వివాహమై ఒక బాబు కూడా పుట్టిన తర్వాత మార్షల్ ఆర్ట్స్‌లో రాణించడమంటే మాటలు కాదు. ఇది కూడా సులభంగా చేయవచ్చని నిరూపిస్తున్నారు గుంటూరుకు చెందిన ఆలపాటి హనుమాన్, వేణు మాధురి దంపతులు. ప్రేమ వివాహం చేసుకున్న వీరికి అనేక కష్టాలు వెంటవచ్చాయి. వాటిని చిరునవ్వుతో స్వీకరిస్తూ ఎలా ముందుకు సాగాలో ఆలోచించి ఆ దిశగా దూసుకుపోతున్నారు. వేణు మాధురి ఈ నెల 11 నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరుగుతున్న ఆలిండియా యూనివర్సిటీ జూడో చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చింది.

స్నేహంతో చిగురించిన ప్రేమ

విన్నకోట వేణుమాధురి, హనుమాన్‌కు తొలుత స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారి చివరకు 2014లో వివాహం వరకు దారితీసింది. 2015లో వీరికి ఒక బాబు పుట్టాడు. హనుమాన్ కూడా మార్షల్ ఆర్ట్స్‌లో దిట్ట. 2వ డాన్ బ్లాక్‌బెల్ట్. అనేక జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. అప్పుడప్పుడు హనుమాన్ మ్యాచ్‌ల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతుంటాడు.

వేణు మాధురికి కరాటేలో కొన్ని భంగిమల పేర్లు చెప్పి తాను కరాటే నేర్పించే విద్యార్థులకు శిక్షణ ఇప్పించేవాడు. అలా ఒక పాపకు పాలిస్తూ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ప్రారంభించిన వేణు మాధురికి ఏడాదిలో కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించింది. కరాటేతో పాటు ఉషు, జూడోలో మంచి పట్టు ఉంది. భర్త హనుమాన్ గురువుగా ఆమెను తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించాడు. భార్యాభర్తలిద్దరూ కలిసే సాధన చేస్తారు. అరడజను పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే, జూడో, ఉషు పాఠాలు నేర్పిస్తారు. హనుమాన్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో జూడో కోచ్‌గా పనిచేస్తున్నారు.

వేణుమాధురి సాధించిన విజయాలు

2017లో బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్, 2018లో కరాటే నేషనల్ సురక్షా కప్‌లో బంగారు పతకం, 2021లో మధ్యప్రదేశ్‌లోని ఉషు జాతీయ పోటీలు, 2022లో జమ్మూ అండ్ కాశ్మీర్‌లో 31వ సీనియర్ నేషనల్స్ ఉషు చాంపియన్‌షిప్‌తో పాటు పలు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఇప్పటి నుంచే వారిని క్రీడాకారులుగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. వేణు మాధురి ఎన్ఐఎస్ సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు 6 వారాల పాటు ఢిల్లీ వెళ్లనుంది.

ఆలుమగల కరాటే ప్రయాణం

- భర్త కోసం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, బ్లాక్ బెల్ట్ సాధన
- జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన
- ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



సాధన చేస్తున్న భార్యాభర్తలు



శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న వేణుమాధురి

కష్టాలను కలిసే ఎదుర్కొన్నాం

ప్రేమ వివాహం చేసుకున్న క్రమంలో కొన్ని విమర్శలు ఎదుర్కొన్నాం. అయినా వెనుకడుగు వేయలేదు. ప్రతి అంశాన్ని చర్చించి పరిష్కరించుకున్నాం. ఒక్క గంట కూడా వృథా చేయం. కుటుంబం, సాధన, ఉద్యోగం, పిల్లల బాధ్యత ఇలా అన్ని విషయాల్లోనూ ఒకరి అభిప్రాయాలను ఒకరం పంచుకుంటాం. మార్షల్ ఆర్ట్స్ క్రీడే మమ్మల్ని కలిపింది. ఆ విద్యే మాకు అన్నం పెడుతోంది. దానిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. ఇక్కడ వరకు రావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు.

– హనుమాన్, వేణుమాధురి

మార్చి 4, 5న టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విజయవాడ వారిచే నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు మార్చి 4, 5 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఏపీ టైప్‌రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా టైప్ రైటింగ్ పరీక్షలు ఇంగిష్, తెలుగు, హిందీ భాషలలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, అదనంగా ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలను మార్చి 4, 5 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా 38 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ తెలుగు పరీక్షలు ఫిబ్రవరి 25న, షార్ట్ హాండ్ ఇంగ్లిష్ పరీక్షలు ఫిబ్రవరి 26న అన్ని గ్రేడ్‌లలో 6 కేంద్రాలలో జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలని, పూర్తి వివరములకై స్థానిక ప్రభుత్వ గుర్తింపు కలిగిన టైప్ ఇనిస్టిట్యూట్స్‌లో సంప్రదించాలని చెప్పారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2300, గరిష్ట ధర రూ.3200, మోడల్ ధర రూ.2800 వరకు పలికింది.

క్లుప్తంగా

22న బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు అండర్–13, 17 బాలబాలికల జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ మహేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ నరసింహారావు సెల్ నంబర్ 98482 98333ను సంప్రదించాలన్నారు.

144 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు

పట్నంబజారు(గుంటూరు): సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిబంధనలు పాటించని 144 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ షేక్ కరీం చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దానిలో భాగంగా అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై 31 కేసులు, సరుకు రవాణా చేస్తున్న 52 బస్సులు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిలుపుదల చేసిన 37 బస్సులు, ఇతర కేసులు 24 కలిపి మొత్తం 144 నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా తిరిగే వాహనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు.

ముస్లింల మేలు కోరే సీఎం జగన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు(గుంటూరు): ముస్లిం మైనార్టీల మేలు లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ ముస్లిం సమాజ్ ములాఖతీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ముస్లిం మతపెద్దల సమావేశం జరిగింది. రాజకీయాలకు అతీతంగా జరిగే ములాఖతీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ తమ పార్టీకి, తమకు అండగా నిలిచిన అన్ని వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా కొత్త సంవత్సరంలో తొలిసారిగా జరుపుతున్న ముస్లిం సమాజ్ ములాఖతీకి అత్యంత ప్రాధాన్యత నెలకొన్నదన్నారు. సమస్యల పట్ల, సమాజం పట్ల అవగాహన గల ముస్లిం సోదరులందరినీ ములాఖతీలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో ముస్లింలకు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా మైనారిటీ అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేస్తున్నారని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. ముస్లింల మేలు కోరే సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ వై.షేక్, ముస్లిం మత పెద్దలు హఫీజ్ అబ్బాస్, హఫీజ్‌ఇర్షాద్, హఫీజ్ సల్మాన్, హఫీజ్ అయూబ్, మౌలానా అబ్దుల్ రెహ్మాన్, ప్రభుత్వ క్వాజీ హఫీజ్ ఉస్మాంసిద్ధిఖీ, కార్పొరేటర్లు మార్కెట్ బాబు, షేక్ రోషన్, మౌలానా అబుల్ కలాం అజాద్, షాదీఖానా చైర్మన్ షేక్ ఫరియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఖోఖో ఆటగాడిగా సీఈసీ విద్యార్థి


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చీరాల: దక్షిణ భారత సాంకేతిక విశ్వవిద్యాలయాల ఖోఖో టోర్నీలో ఉత్తమ ఆటగాడిగా చీరాల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 12 వరకు జేఎన్టీయూ కాకినాడలో దక్షిణ భారత సాంకేతిక విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదిచ్చేరి నుంచి 78 జట్లు పాల్గొన్నాయి. జేఎన్టీయూ కాకినాడ తరపున చీరాల ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎ.శివారెడ్డి, వి.ఏడుకొండలరెడ్డి ప్రాతినిథ్యం వహించారు. తుదిపోరులో జెఎన్టీయూకే జట్టు, ఏఎన్‌యూ జట్లు తలపడ్డాయి. శివారెడ్డి, ఏడుకొండలరెడ్డి ప్రతిభ కనబరచి జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించారు. ఉత్తమ ఆటగాడిగా శివారెడ్డి ఎంపికయ్యాడు. మొదటి స్థానంలో జేఎన్టీయూకే రాగా, ద్వితీయ స్థానంలో ఏఎన్‌యూ జట్టు, తృతీయ స్థానంలో మంగళూరు జట్టు నిలిచాయి.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

మంగళగిరి: మంగళగిరి కోర్టుల పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక కోర్టులో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేషనల్ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరన్యాయం జరుగుతుందని తెలిపారు. మంగళగిరిలో కేసుల పెండింగ్ ఎక్కువగానే ఉందని, కొత్త కోర్టుల అవసరం ఉందని అభిప్రాయ వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 87వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పోలీసులు కూడా వారెంట్లపై దృష్టి సారించడంతో పాటు చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11లోగా కేసులన్నీ గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తొలుత కోర్టుల ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించి బాగా ఏర్పాటు చేశారని జిల్లా జడ్జి కితాబు ఇచ్చారు. మంగళగిరి కోర్టులు జిల్లాలో రోల్‌మోడల్ కోర్టులుగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.శేషయ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.నాగమణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.బ్రహ్మానందరావు, టి.నరసింహారావు, ఉపాధ్యక్షుడు జె.లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ఎంఈఓల పరిశీలన నిరంతరం కొనసాగాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: విద్యాశాఖలో వస్తున్న నూతన మార్పులను మండల విద్యాశాఖాధికారులు తెలుసుకోవడంతో పాటు పనితీరులోనూ మార్పు తెచ్చుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యాశాఖాధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంఈఓలకు మనబడి నాడు–నేడు కార్యక్రమం ఒక్కటే కాదన్నారు. ప్రతి అధికారి వారానికి కనీసం 5 రోజులు పాఠశాలలను సందర్శించాలని చెప్పారు. డ్రాప వుట్స్, బడి బయటఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని 85 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలకు సమయానికి కోడిగుడ్లు, చిక్కీలు సరఫరా అవుతున్నాయా?, అందులో ఏమన్నా లోపాలు, అవినీతి ఉంటోందా?, సమయానికి వస్తున్నాయా? వంటి అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. ఇటీవల ముగిసిన ఎస్ఏ–1 (సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్ష ఫలితాలు ఈ నెల 20న ఆన్‌లైన్లో పొందుపరచాలని చెప్పారు. మనబడి నాడు–నేడులో భాగంగా తయారవుతున్న ఆర్వో ప్లాంట్‌లు ఈ నెలాఖరుకు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫేజ్–2లో జరుగుతున్న అభివృద్ధి పనుల ఫొటోలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పారదర్శక సేవలందించాలి

గుంటూరు వెస్ట్: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: పునర్విభజన తర్వాత జరుగుతున్న తొలి గణతంత్ర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి కలెక్టర్ అధికారుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక పోలీస్ పరేడ్ మైదానాన్ని సుందరంగా అలంకరించాలన్నారు. వివిధ శాఖలు రూపొందించే శకటాలు ప్రభుత్వ వైభవాన్ని, అభివృద్ధిని సూచించే విధంగా ఉండాలని చెప్పారు. విధుల్లో ప్రతిభకనబరచిన ఉద్యోగుల జాబితాలను ఈ నెల 22లోపు ఆయా శాఖాధికారులు కలెక్టరేట్‌కు పంపాలన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం..

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ, మండల కేంద్రాలు, పోలింగ్ బూత్ స్థాయిల్లో ఓటర్లతో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, డీఈఓ పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ చైర్మన్‌గా శివరామకృష్ణ

నెహ్రూనగర్: ది ఇనిస్టూట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అమరావతి చాప్టర్ నూతన చైర్మన్‌గా శివరామకృష్ణ నియమితులయ్యారు. అరండల్ పేటలోని ఓ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. చైర్మన్‌గా శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు కుమార్, కార్యదర్శిగా కె.విజయ్ కుమార్, కోశాధికారిగా సిద్ధార్థ ఎన్నికయ్యారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా శివరాం ప్రసాద్, మహమ్మద్ అబ్బాస్ సయ్యద్, బాల చంద్రమౌళి వ్యవహరించనున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన శివరామకృష్ణ మాట్లాడుతూ కంపెనీ సెక్రటరీస్(సీఎస్) కోర్సుకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ తరగతులు నిర్వహించే దిశగా అడుగులు వేయనున్నట్లు పేర్కొన్నారు.

సామర్లకోట వరకు గుంటూరు–విశాఖపట్నం రైలు

లక్ష్మీపురం: గుంటూరు– విశాఖపట్నం – గుంటూరు రైలు విజయవాడ డివిజన్‌లోని సామర్లకోట వరకు మాత్రమే నడుపుతున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు బుధవారం తెలిపారు. పలు అభివృద్ధి పనులు నేపథ్యంలో రైలు నెంబర్ 17239 ఈనెల 21, 22వ తేదీలలో గుంటూరు– సామర్లకోట వరకు మాత్రమే వెళ్తుందని చెప్పారు. రైలు నెంబర్ 17240 విశాఖపట్నం–గుంటూరు రైలు ఈనెల 22, 23వ తేదీలలో సామర్లకోట స్టేషన్ నుంచి గుంటూరు వరకు ఉంటుందని చెప్పారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన


పోటీలు ప్రారంభిస్తున్న గొట్టిపాటి భరత్

పర్చూరు: మండల పరిధిలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి బండలాగు ఎడ్ల బలప్రదర్శన పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన సేద్య విభాగం విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, కురిచేడు మండలం, కాటంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 5622.4 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. రాజుపాలెం మండలం, ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లజత 5568.4 అడుగుల దూరం లాగి ద్వితీయ, గుంటూరు జిల్లా, కాకుమానుకు చెందిన నల్లమోతు వీరయ్యాచౌదరి ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకుంది. అలాగే ఏడు వరకు విజేతల వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి సబ్ జూనియర్స్ విభాగంలో మొత్తం 8 జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా గురజాల నియోజకవర్గ పరిశీలకులు గొట్టిపాటి భరత్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రైతులకు మెమోంటోలు అందజేశారు. గురువారం సాయంత్రం పెద్దసైజు విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో మంగళవారం రాత్రి జరిగిన సబ్ జూనియర్స్ విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి ఎడ్లజత 4723.07 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, కృష్ణాజిల్లా, పెనమలూరుకు చెందిన భావినేని మల్లిఖార్జునరావు అండ్ బ్రదర్స్ ఎడ్లజత 4274.08 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. ఈ విభాగంలో కూడా ఏడు బహుమతులు ప్రకటించారు. బుధవారం రాత్రి సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాదెండ్ల: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్ఐ ఆవుల భాస్కర్ కథనం మేరకు.. ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన దంపతులు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెద్ద కుమార్తె పదో తరగతి చదువుతుండగా, రెండో కుమార్తె ఎనిమిదో తరగతి చదువుతోంది. వీరికి సమీప బంధువైన తలారి వేళంగిరాజు వ్యవసాయ పనులకు బాలిక తండ్రితో కలిసి వెళ్తుంటాడు. ఈ నెల పదో తేదీ బాలిక తండ్రికి కిడ్నీ సంబంధిత సమస్య రావడంతో నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల పదో తేదీ హైస్కూల్ వద్దకు వెళ్లి రెండో కుమార్తెతో మీ నాన్న ఆసుపత్రిలో ఉన్నాడు.. నిన్ను చూడాలంటున్నాడని చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఉపాధ్యాయులకు అనుమానం వచ్చి ఫోన్‌లో బాలిక తండ్రికి విషయం చెప్పారు. తాను తీసుకురమ్మని చెప్పలేదనడంతో ఉపాధ్యాయులు ఖంగుతిన్నారు. దీంతో ఇద్దరు ఉపాధ్యాయులు రాంబాబు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెంబడించారు. నాదెండ్ల సమీపంలోని సుబాబుల్‌తోటలో బాలికను, రాంబాబును పట్టుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారమివ్వగా తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రాంబాబును బుధవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జాతీయ సదస్సు


జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, యూనివర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ డాక్టర్ పి.రవి మాట్లాడుతూ అడ్వాన్సెస్ ఇన్ ఫైటో మెడిసిన్ అండ్ ఫైట్ నానో కాంపోజిట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అల్లోపతి మెడిసిన్లో వచ్చేటువంటి డ్రగ్ రెసిస్టెన్స్‌ను దృష్టిలో పెట్టుకొని నాచురల్ ప్రొడక్ట్స్ ప్రాముఖ్యతని, ఉపయోగాలను తెలియపరచడమే సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. పలు కొత్త పద్ధతులను ఉపయోగించి నేచురల్ ప్రొడక్ట్స్ నుంచి కొత్త మందులను తయారు చేయడమే ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమని చెప్పారు. జాతీయ సదస్సుకి కో కన్వీనర్ గా కే విజయ్ కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కేఈ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డాక్టర్ ఎం.గాయత్రి రమ్య, డాక్టర్ డి.రవిచంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమీల రాణి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్, యూజీ పరీక్షల సమన్వయకర్త ప్రొఫెసర్ సంధ్య కోల్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ సునీత, దూరవిద్య కేంద్రం పరీక్షల నిర్వహణ సమన్వయకర్త ప్రొఫెసర్ సోమశేఖర్, ర్యాంకుల కో ఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిషోర్ పాల్గొన్నారు.

22న కానిస్టేబుళ్ల పోస్టులకు ప్రిలిమినరీ రాత పరీక్ష

- 45 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు
- స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన గుంటూరు రేంజ్ ఐజీ


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఐజీ త్రివిక్రమవర్మ, చిత్రంలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న జిల్లాలో నిర్వర్తించే కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ అన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో బుధవారం పలు విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 45 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీ పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను లోనికి అనుమతిస్తారని, 10 గంటలకు ఒక నిమిషం దాటినా ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులను గుర్తింపు కార్డు ద్వారా లోనికి అనుమతిస్తారని, హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నలుపు లేదా బ్లూ పెన్ మాత్రమే ఉండాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో జెరాక్స్, మొబైల్ దుకాణాలు మూసివేయాలని, గుంపులుగా జనం ఉండరాదన్నారు. అనంతరం ప్రశ్నాపత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఐజీ పరిశీలించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ప్రొఫెసర్, పరీక్షల చీఫ్ సమన్వయకర్త సిద్ధయ్య, చీఫ్ ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్‌లు, ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), అనీల్‌కుమార్ (ఎల్అండ్ఓ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఎస్‌బీ సీఐలు బి.నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధమైంది.. పేదగుండె ఆగింది!

- ప్రమాదాన్ని చూస్తూ గుండెపోటుకు గురై వృద్ధురాలి మృతి
- పూడివాడ పడమట పాలెంలో ఘటన


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు, గుండెపోటుతో మృతి చెందిన సామ్రాజ్యం (ఫైల్)

నగరం: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమవుతుండంతో ఆందోళనకు గురై గుండెపోటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పూడివాడ పడమటపాలెంలో జరిగింది. పడమటపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం అర్ధరాత్రి పూరింటికి మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న రమేష్ కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరిగెత్తారు. పూరిల్లు అగ్నికి ఆహుతవ్వడం చూసి ఆందోళన చెందిన రమేష్ తల్లి సామ్రాజ్యం (65) ఒక్కసారిగా కిందపడి గుండెపోటుతో మృతి చెందింది. సామ్రాజ్యం మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అగ్ని ప్రమాదంలో సుమారు రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పాగోలు సుజాత సంఘటన స్థలానికి చేరుకుని రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ సాయం కింద 20 కేజీలు బియ్యం, రూ.5 వేలు నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాగోలు వెంకటేశ్వరరావు, జాలాది సునీల్, శివయ్య పాల్గొన్నారు.